న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

న్యాయవాదుల ఆందోళన

కేంద్రం తీరును నిరసిస్తూ నూజివీడు బార్ అసోసియేషన్ సభ్యులు కోర్టు భవనాల ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్ మాట్లాడుతూ న్యాయవాదుల హక్కులను కాలరాసేలా న్యాయవ్యవస్థను, న్యాయవాద వృత్తిని అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన అడ్వకేట్ అమైండ్‌మెంట్ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఈ చట్టం వల్ల న్యాయవాద వ్యవస్థ నిర్వీర్యమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఈ యోచన మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

'మద్యం' షురూ..!

అమల్లోకి కొత్త మద్యం పాలసీ

ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ

9 వరకూ దరఖాస్తు ప్రక్రియ, 11న లాటరీ

ఏలూరు జిల్లాలో 144, పశ్చిమలో 175 దుకాణాలు

గీత కార్మికులకు దుకాణాల కేటాయింపుపై స్పష్టత కరువు

వాటాల కోసం పలువురు ప్రజాప్రతినిధుల హుకుం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొత్త మద్యం పాలసీ అమలకు అడుగులు పడ్డాయి. మంగళవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. దుకాణాల కేటాయింపును జనాభా ప్రాతిపదికన నాలుగు విభాగాలుగా కేటాయించారు. పది వేలలోపు జనాభా, పది నుంచి 50 వేలలోపు, 50 వేల నుంచి ఐదు లక్షలలోపు, ఐదు లక్షల జనాభా ప్రాతిపదికన దుకాణాల కేటాయింపునకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పశ్చిమగోదావరి జిల్లాలో 175 దుకాణాలకు, ఏలూరు జిల్లాలో 144 మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ సాగుతోంది. గీత కార్మికులకు ఇస్తామని ప్రకటించిన పది శాతం దుకాణాలపై ఇంకా స్పష్టమైన ప్రకటన రావాల్సి ఉంది. ఈ నెల ఒకటి నుంచి తొమ్మిదో తేదీ వరకూ దరఖాస్తుల స్వీకరణ సాగనుంది. 11వ తేదీన లాటరీ ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు జరగనుంది. దీనికోసం ఎక్సైజ్ శాఖాధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తొలిరోజు మంగళవారం దరఖాస్తులు రాలేదని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. రెండో తేదీ అమావాస్య కావడంతో, నాలుగోతేదీ తర్వాతే దరఖాస్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఒక వ్యక్తి ఎన్ని మద్యం దుకాణాలకైనా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ప్రతి దరఖాస్తుకూ రూ.రెండు లక్షలు నాన్ రిఫండబుల్ ఫండ్ కట్టాల్సి ఉంటుంది. లాటరీలో మద్యం దుకాణం దక్కినా, దక్కకపోయినా ఆ సొమ్ము వెనక్కి ఇవ్వరు. లాటరీలో దుకాణాలు దక్కించుకున్నవారికి రెండేళ్ల కాలపరిమితి ఉంటుంది. మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు నిర్దేశించిన లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అందుకు కొంత గడువు ఇస్తారు.

మద్యం దుకాణాల్లో వాటా కోసం నాయకుల హుకుం

మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కావడంతో కొంతమంది ప్రజాప్రతినిధులు వాటాల కోసం పావులు కదుపుతున్నారు. గీతకార్మికులు దక్కించుకునే దుకాణాల్లో 75 శాతం వాటా ఇవ్వాలంటూ డెల్టాలోని ఓ ప్రజాప్రతినిధి హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. దీంతో గీతకార్మిక సామాజిక తరగతికి చెందిన వారంతా గడిచిన సోమవారం భీమవరంలో సమావేశమై దీనిపై చర్చించినట్లు తెలిసింది. నాయకులు కోరుతున్నట్లుగా చేసే ప్రసక్తిలేదని అంతా గట్టిగా నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇదే విషయాన్ని శెట్టిబలిజ సామాజిక తరగతికి చెందిన మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ దృష్టికి సైతం తీసుకెళ్లినట్లు సమాచారం. దీనిపై ముందుముందు ఏం జరుగుతుందో చూడాల్సి ఉంది. ఇతరులు దక్కించుకున్న మద్యం దుకాణాల్లోనూ వాటాల కోసం కొంతమంది ప్రజాప్రతినిధులు తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు చెబుతున్నారు. మద్యం దుకాణాలకు వేసే దరఖాస్తుల్లో సిండికేట్ విధానానికి తెరలేపేందుకు నాయకులు వ్యూహాలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఏ దుకాణానికి ఎంతమంది దరఖాస్తు చేయాలి. దుకాణం దక్కించుకున్న వ్యక్తి దక్కని వ్యక్తులకు వాటా ఇవ్వాలా.. కొంతమొత్తంలో సొమ్ము చెల్లించాలా అనే దానిపై తీవ్ర తర్జనభర్జనలు పడుతున్నట్లు చెబుతున్నారు. దరఖాస్తుల సమర్పణలో సిండికేట్ విధానం సాగితే మాత్రం ప్రభుత్వ ఆదాయానికి గండిపడే పరిస్థితి ఏర్పడనుంది. మద్యం దుకాణాలకు సంబంధించి ముందుముందు మరిన్ని పరిణామాలు చోటుచేసుకునే పరిస్థితి కన్పిస్తోంది.

నిరసిస్తున్న దీక్షాధారులు, నేతలు

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పోరాడాలి

విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ పోరాడాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం తలపెట్టిన ఒక్కరోజు నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ విషయంలో కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వ వైఖరిలో ఏమాత్రం మార్పులేదని, అధికారులు వ్యవహరిస్తున్న తీరు, మంత్రులు మాట్లాడుతున్న తీరు, రాజకీయ నాయకుల ప్రకటనలు చూస్తుంటే విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై పెద్ద కుట్ర జరుగుతున్నట్లు కన్పిస్తోందన్నారు. రాష్ట్రం నుంచి స్టీల్ సహాయ మంత్రిగా శ్రీనివాస్‌వర్మ ఉన్నారని, విశాఖ స్టీల్‌ప్లాంట్ నడిపేందుకు అవసరమైన నిధులు, ఇనుప ఖనిజాన్ని ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికులు నాలుగు వేల మందిని రాత్రికిరాత్రే ఇంటికి పంపించేశారని, ఇది అత్యంత దుర్మార్గమని అన్నారు. మరో 500 మంది పైగా ఉద్యోగులను డిప్యూటేషన్ పేరుతో వివిధసంస్థలకు పంపించే ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, పట్టణ అధ్యక్షులు మనోజ్, పిడిఎస్‌యు నాయకులు క్రాంతి, యశ్వంత్, టిఎన్ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రసన్న, కాంగ్రెస్ యువజన నాయకులు సతీష్, వైసిపి యువజన నాయకులు శివరాం తదితరులు దీక్షలో పాల్గొన్నారు. మధ్యాహ్నం సిఐటియు జిల్లా నాయకులు బి.సోమయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య దీక్షలో పాల్గొన్న వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. వైసిపి నాయకులు మామిళపల్లి జయప్రకాష్ దీక్షకు మద్దతుగా పాల్గొన్నారు.

'పోలవరం' నిర్వాసితులకు న్యాయం చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన ఎంఎల్ఎ చిర్రి బాలరాజుకు వినతి

ప్రజాశక్తి - కుక్కునూరు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల సర్వం కోల్పోయి నిరాశ్రయులవుతున్న ప్రతి నిర్వాసితుడికీ న్యాయం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు డిమాండ్ చేశారు. మంగళవారం కుక్కునూరు మండలంలో పర్యటించిన పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజుకు, ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులకు సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప, నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం గతంలో ఏర్పాటు చేసిన గ్రామసభల్లో ఇల్లు కావాలని కోరుకున్న వారికి చల్లవారిగూడెంలో ఇంటి నిర్మాణం చేపట్టారని, ఇల్లు వద్దని దరఖాస్తు చేసుకున్న వారికి రూ.3.85 లక్షలు నగదుగా ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించిందని గ్రామసభల్లో అధికారులు తెలిపారన్నారు. నిర్వాసితుల కోసం చల్లవారిగూడెంలో నిర్మించిన ఇల్లు, ఇంటి స్థలం ప్రస్తుత రిజిస్ట్రేషన్ వాల్యుయేషన్ ప్రకారం రూ.10 లక్షలు వరకూ ఉందని, ఇల్లు వద్దనుకున్న వారికి ప్రభుత్వం కేవలం రూ.3.85 లక్షలే ప్రకటించడంతో ప్రతి నిర్వాసితుడికీ రూ.ఆరు లక్షల మేర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ఇల్లు వద్దనుకున్న వారికి సైతం రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాస, ఇంటి పరిహారం ఇచ్చి, నిర్వాసితులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యనూ పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మహబూబ్ పాషా పాల్గొన్నారు.

వినతి అందిస్తున్న నేతలు

నూరు శాతం పెన్షన్ల పంపిణీకి చర్యలు

నగరంలో పెన్షన్ల పంపిణీని పరిశీలించిన కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

పింఛన్ సొమ్ము అందిస్తున్న కలెక్టర్

ఎన్‌టిఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల పంపిణీ నూరుశాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక శాంతినగర్ సచివాలయం-2 పరిధిలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇంటి వద్దే పెన్షన్ల సొమ్మును కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెన్షన్లను తొలి రోజే పూర్తి స్థాయిలో పంపిణీ చేసేందుకు అన్ని రకాల చర్యలూ తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా పెన్షన్ల లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడుతూ 'మీకు ఎప్పటినుంచి పెన్షన్లు వస్తున్నాయి, ఇంటి వద్దకే వచ్చి పెన్షన్ సొమ్ము అందిస్తున్నారా' అంటూ పలు వివరాలను ఆరా తీశారు. జిల్లాలో సాయంత్రం నాలుగు గంటలకే 95 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయిందన్నారు. అనివార్య కారణాలతో మంగళవారం పెన్షన్ తీసుకోనివారికి గురువారం అందిస్తామన్నారు. కలెక్టర్ వెంట డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.భానుప్రతాప్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్ఎన్ఆర్.నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలి

స్వచ్ఛత హీ సేవా సైకిల్ ర్యాలీలో కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎ, జిల్లా అధికారులు

పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ నడుం బిగించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక జ్యూట్‌మిల్లు సెంటరులోని అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి నిర్వహించిన సైక్లోథాన్ సైకిల్ ర్యాలీలో ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణతో కలిసి ఆమె పాల్గొన్నారు. తొలుత పరిసరాల పరిశుభ్రత కోసం శ్రమదానానికి కొంత సమయం కేటాయిస్తామని-స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌ను సాధించి తద్వారా స్వచ్ఛ భారత్‌ను సాధించే లక్ష్యంతో కృషి చేస్తామని అందరితో ప్రతిజ్ఞ నిర్వహించారు. ర్యాలీని డిఆర్‌ఒ డి.పుష్పమణి జెండా ఊపి ప్రారంభించగా జ్యూట్‌మిల్లు నుంచి వట్లూరులోని సిఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల వరకు సాగింది. ప్రజలందరిలో పర్యావరణంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ ర్యాలీ నిర్వహించామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. ప్రజలందరూ స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగస్వాములై జిల్లాను స్వచ్ఛ జిల్లాగా రూపుదిద్దేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత, సమిష్టి బాధ్యత అని ఇందులో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వివిధ ఈవెంట్ల ద్వారా 98 శాతం పూర్తిచేసి రాష్ట్రంలో మొదటిగా నిలిచామన్నారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజల్లో ఆరోగ్యంతోపాటు పరిశుభ్రతపై మరింత అవగాహన కల్పించడం కోసం సైకిల్ ర్యాలీ నిర్వహించామన్నారు. జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు మాట్లాడగా కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, మున్సిపల్ కమిషనర్ ఎన్.భానుప్రతాప్, జిల్లా మైనారిటీస్ సంక్షేమాధికారి ఎస్ఎస్.కృపావరం, డిఎస్‌డిఒ శ్రీనివాసరావు, సెట్‌వెల్ సిఇఒ ప్రభాకరరావు, పశుసంవర్ధకశాఖ జెడి జి.నెహ్రూబాబు, ఐసిడిఎస్ పీడీ కె.పద్మావతి, సహాయ పర్యాటక అధికారి పట్టాభి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ముక్కంటి, తహశీల్దారు శేషగిరి, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్ఎన్ఆర్.నాగేశ్వరరావు,

ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులు

ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై జెసి ధాత్రిరెడ్డి సమీక్ష

ప్రజాశక్తి - ఏలూరు

ఖరీఫ్ ధాన్యం కొనుగోలు సజావుగా, సాఫీగా నిర్వహించేందుకు ఆయా మండలాలకు నియమించిన ప్రత్యేక అధికారులు మండలస్థాయిలో సమావేశాలు నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో 2024-25 ఖరీఫ్ పంట కాలంలో ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళికలో భాగంగా మండల ప్రత్యేక అధికారులతో ధాన్యం కొనుగోలు సన్నాహక ఏర్పాట్లపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ధాన్యం కొనుగోలులో ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు, పెదపాడు, నిడమర్రు, ముదినేపల్లి, పెదవేగి, పోలవరం, చింతలపూడి, జంగారెడ్డిగూడెం మండలాలు ముఖ్యపాత్ర వహిస్తాయన్నారు. దీనిపై ఆయా మండలాల్లో అధికారులతో సమీక్ష జరిపి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని, అక్కడ పరిష్కారం కాని అంశాలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మండలస్థాయి కస్టమైజింగ్ ప్రణాళిక ఉండాలన్నారు. ప్రొక్యూర్మెంట్ సపోర్టింగ్ సంస్థలు ధాన్యం కొనుగోలుకు ఏర్పాటు చేసుకున్న సిబ్బందికి అవసరమైన శిక్షణ, వసతులు కల్పించేందుకు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను పరిశీలించాలన్నారు. ధాన్యాన్ని రైతుల కళ్లాల వద్దే సేకరించి రైతు కోరిన సమీప రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. రైతులు కనీస మద్దతు ధర పొందాలంటే, పంట కోసిన తర్వాత, సేకరిండానికి ముందు ధాన్యాన్ని శుభ్రం చేసి ఆరబెట్టాలని, ధాన్యం సేకరణ విషయంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని అన్నారు. ఈ విషయాలను రైతులకు తెలిపేలా గ్రామ సభలు, కరపత్రాలు, బ్యానర్ల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. సమావేశంలో జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కె.అద్దయ్య, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వి.శ్రీలక్ష్మి, డిఎస్ఒ ఆర్ఎస్ఎస్.రాజు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్‌భాషా, మత్స్యశాఖ జెడి నాగలింగాచారి, డిసిఒ శ్రీనివాసరావు, ఉప రవాణా కమిషనర్ కరీం, వయోజనవిద్య ఎడి ప్రభాకరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్ఎస్, సుబ్బరాజు జీవితాలు ఆదర్శనీయం

ప్రజాశక్తి - చింతలపూడి

మాట్లాడుతున్న డిఎన్‌విడి.ప్రసాద్

సిపిఎం సీనియర్ నేత, మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్), సుబ్బరాజు జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ అన్నారు. చిన్ననాటి నుండి కమ్యూనిస్టు భావాలతో పేదలు, కార్మికులు, రైతుల సమస్యలపై నిరంతరం పోరాడి తుదిశ్వాస విడిచే వరకూ ఎర్రజెండాను భుజంపై మోసిన ఆర్ఎస్, సుబ్బరాజు ధన్యజీవులన్నారు. ఆర్ఎస్ సంస్మరణ, సిపిఎం పాత చింతలపూడి తాలూకా కార్యదర్శి సింగంశెట్టి సుబ్బరాజు 38వ వర్ధంతి సభ ఆ పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథి ప్రసాద్ మాట్లాడుతూ నేటి యువత విష సంస్కృతి ప్రభావం వల్ల పక్కదారి పడుతోందన్నారు. రైతులు, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను పాలకులు కాలరాస్తున్నారని, వారి హక్కుల కోసమే ఆర్ఎస్, సుబ్బరాజు నిరంతరం పోరాడేవారని గుర్తు చేశారు. అనంతరం రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు పి.సోమశేఖర్, జనసేన నాయకులు ఎ.అప్పారావు, వైసిపి కార్మిక నేత ఎం.ఇమ్మానుయేల్, సిపిఐ మండల కార్యదర్శి కె.గురవయ్య మాట్లాడుతూ ఆర్ఎస్, సుబ్బరాజు పోరాట తీరును కొనియాడారు. అనంతరం ప్రముఖ వైద్యులు డాక్టర్ అన్నవరపు సత్యనారాయణ, మదర్ థెరిస్సా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తూము విజయ్‌కుమార్‌లను సిపిఎం పట్టణ కార్యదర్శి సింగంశెట్టి సూర్యకుమార్ కుటుంబ సభ్యులు సన్మానించారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

మండవల్లి : ముంపుకు గురైన గ్రామాలలోని ప్రజలను ఆదుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ స్పష్టం చేశారు. మండలంలోని కాకతీయ నగర్‌లో వరద బాధితులకు సిఐటియు ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో అనేక గ్రామాలు నీట మునిగాయని అన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో వరద బాధితులను ఆదుకునే విధంగా కార్మికుల సహాయంతో వందమంది కుటుంబాలకు నిత్యవసర సరుకులను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కె.విజయలక్ష్మి, నాగమణి, ప్రాజెక్ట్ లీడర్ చెల్లమ్మ, గన్నవరం సెక్టార్ లీడర్ విజయలక్ష్మి, ఆశ వర్కర్ యూనియన్ లీడర్ శివ పార్వతి పాల్గొన్నారు.

వసతి గృహాల సందర్శన

చింతలపూడి : వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు అన్నారు. మంగళవారం రాష్ట్ర న్యాయ సేవాధికర సంస్థ ఆదేశాల మేరకు చింతలపూడిలో పలు సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల వసతి గృహాలను ఉదయం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందించే ఆహారాన్ని పరీక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని, సురక్షిత తాగునీరు అందించాలని వసతి గృహ అధికారులకు సూచించారు. న్యాయవాదులు డేవిడ్ రాజు, సోషల్ వర్కర్ అక్బర్ అలి, కోర్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

భీమడోలు : విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించి సబ్జెక్టుపై పూర్తి అవగాహన కలిగి పాస్ అయితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రాంతీయ ఉపాధి కల్పనాధికారి రామ్మోహన్‌రావు తెలిపారు. ఉపాధి కల్పనా కార్యాలయం, సెటిల్ సిఇఒ ప్రభాకర్ సంయుక్త ఆధ్వర్యంలో భీమడోలు గీతాంజలి డిగ్రీ, జూనియర్ కళాశాలలో శనివారం కెరీర్ డెవలప్మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథి రామ్మోహన్‌రావు విద్యార్థులకు విద్య, ముఖాముఖి కార్యక్రమాన్ని ఎదుర్కొనేందుకు అవసరమైన మెలుకువలు తెలిపారు.

కాల్‌మనీ వేధింపులు: నలుగురిపై కేసు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కాల్‌మనీ వేధింపులకు పాల్పడుతున్న నలుగురిపై పోలీసులు కేస్ నమోదు చేశారు. వీరి కోసం ఒకటో పట్టణ పోలీసులు బృందాలుగా ఏర్పడి మంగళవారం గాలింపు చర్యలు చేపట్టారు. ఏలూరు నగరంలో కాల్‌మనీ ఘటన కలకలం రేపింది. వేధింపులకు గురిచేస్తున్నారని ఒక్కసారిగా బాధితులు స్థానిక ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్యను వెంటబెట్టుకుని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్‌ను కలిసి తమ గోడును వెళ్లబుచ్చారు. దీంతో ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కాల్‌మనీ వేధింపులకు గురైనట్లు బాధితురాలు సుబ్బలక్ష్మి ఫిర్యాదు చేశారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు 318(4), 308(2), (5), 351, 74, 78, 77, ఆఫ్ బిఎన్ఎస్‌తో పాటుగా రెడ్ విత్ 3 బిఎన్ఎస్ ఆంధ్రప్రదేశ్ మనీ లెండింగ్ యాక్ట్ 2002 కస్టమర్ ప్రొటెక్షన్ యాక్ట్ 2019 సెక్షన్ 74 ఆఫ్ ఇండియన్ కాంట్రాక్ట్ యాక్ట్‌లలో కేసు నమోదు చేశారు. వివరాల్లోకెళితే.. ఫిర్యాదు భర్త పౌరోహిత్యం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ క్రమంలో 2011 సంవత్సరంలో మేడపాటి సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి దగ్గర

నిందితుల కోసం పోలీసుల గాలింపు

డబ్బులు అప్పుగా తీసుకుని తిరిగి చెల్లించారు. 2019లో రూ.లక్షా ఇరవై వేలు తీసుకుని వారానికి రూ.3 వేలు చొప్పున వడ్డీ కడుతూ రూ.లక్షా ఇరవై వేలకు ఆరు లక్షల వడ్డీని చెల్లించారు. ఈ సొమ్ములు మొత్తం ఫోన్ పే ద్వారా చెల్లించినప్పటికీ మేడపాటి సుధాకర్ రెడ్డి అప్పు చెల్లించలేదని తమను వేధిస్తున్నాడని, కాళీ నోట్ల చెక్కులపై సంతకాలు చేయించుకుని కోర్టులో కేసులు నమోదు చేశారని, ఇంట్లోని సామాగ్రి అక్రమంగా పట్టుకుపోయినట్లు తెలిపారు. ఫిర్యాదులోని అంశాలు అంతటితో ఆగకుండా కుటుంబసభ్యులను, మహిళలను చంపేస్తామని బెదిరిస్తూ మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఇచ్చిన అంశాల ప్రకారం మేడపాటి సుధాకర్ రెడ్డి, అతని భార్య లావణ్య, విద్యాసాగర్, రాజేష్‌లతోపాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు. నిందితుల కోసం ఒకటో పట్టణ పోలీసులు మూడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు.



న్యాయం చేయాలని ర్యాలీ చేస్తున్న సిఐటియు నాయకులు

ఆశా వర్కర్‌కు న్యాయం చేయాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు లింగరాజు

ప్రజాశక్తి - టి.నరసాపురం

అన్యాయంగా ఉద్యోగం నుంచి తొలగించిన ఆశావర్కర్ లక్ష్మీమంగకు ఉన్నతాధికారులు న్యాయం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు డిమాండ్ చేశారు. ఆశావర్కర్ కె.లక్ష్మీ మంగ అక్రమ తొలగింపుకు నిరసనగా గత ఐదు రోజులగా విధులు బహిష్కరించి, ధర్నా చేస్తున్న ఆశావర్కర్ల ఆందోళనకు మద్దతుగా సిఐటియు నాయకులు మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశాలు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా శిబిరం నుంచి ర్యాలీ ప్రదర్శనగా బయలుదేరి అంబేద్కర్ సెంటర్ వద్దకు చేరుకున్నారు. అనంతరం మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ అధికార పార్టీలతో స్థానిక మెడికల్ ఆఫీసర్ ఎంఎల్‌హెచ్ పి.నాగబాబు ఆశావర్కర్‌ని వేధించి అన్యాయంగా తొలగించారన్నారు. డిఎంహెచ్‌ఒను యూనియన్ నాయకులు డిమాండ్ చేయగా మళ్లీ విచారణ చేస్తామని చెప్పారు. కానీ నేటికీ విచారణ చేయకపోవడం విచారకరమన్నారు. ఉద్యమం జిల్లా స్థాయికి విస్తరించక ముందే జిల్లా ఆఫీసర్లు ఆమెకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక అమలు కోరుతూ..

4న సిపిఎం ఆందోళనలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉచిత ఇసుక పేరుతో గతం కంటే ఇసుక ధరలను విపరీతంగా పెంచి, అందుబాటులో లేకుండా చేసిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ, తక్షణం ఎన్నికల హామీగా ఇచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఈ నెల 4వ తేదీన అన్ని మండల, పట్టణ కేంద్రాల్లో, ఇసుక ర్యాంపుల వద్ద ధర్నాలు, నిరసనలు, దీక్షలు నిర్వహించాలని సిపిఎం జిల్లా కమిటీ పిలుపు ఇచ్చింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం ఇసుక ధరను బంగారం ధరకు సమానంగా మార్చివేసిందని, భవన నిర్మాణ రంగం దెబ్బతిందని, పేద, మధ్యతరగతి కుటుంబాలు ఇళ్లు నిర్మించుకోలేకపోతున్నారని పదేపదే చెప్పిన టిడిపి కూటమి అధికారంలోకొచ్చాక మరిన్ని ఇబ్బందులు కలిగే విధానం అవలంబిస్తోందని విమర్శించారు. తక్షణం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని, ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని, భవన నిర్మాణ కార్మికులను కాపాడాలని, పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్ల నిర్మాణానికి సౌలభ్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. నాలుగో తేదీన చేపట్టే నిరసనల్లో భవన నిర్మాణ కార్మికులు, ప్రజానీకం పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని రవి విజ్ఞప్తి చేశారు.

బాలుర హాస్టల్‌లో డ్రెయినేజీ వ్యవస్థ పునరుద్ధరణ

పనులను పరిశీలించిన సాంఘిక సంక్షేమ శాఖ జెడి వి.జయప్రకాష్

దెందులూరు : మండలంలోని కొవ్వలి సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహాన్ని మంగళవారం దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ పరిశీలించి డ్రెయినేజీ వ్యవస్థను పూర్తిగా పునరుద్ధరించాలని అధికారులకు సూచించారు. హాస్టల్‌లో బాత్రూంలకు డోర్స్ బిగించడంతో పాటు దోమల మేస్ డోర్స్ కూడా పెట్టాలని అధికారులకు సూచించడంతో ఉన్నతాధికారులు వాటిపై దృష్టి సారించి ఉదయం డ్రెయినేజీ వ్యవస్థను పునరుద్ధరించారు. హాస్టల్ వాడకం, నీరు బయటకు వెళ్లేందుకు డ్రెయినేజీ వ్యవస్థను కొవ్వలి పంచాయతీ సిబ్బంది పూడికలు తీయడంతో మురుగు నీరు బయటకు వెళ్లింది. ఈ నేపథ్యంలో సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జయప్రకాష్ హాస్టల్లో పరిశీలించి సిబ్బంది పనితీరుపై అసహన వ్యక్తం చేశారు. విద్యార్థులను సొంత పిల్లలు వలే చూసుకోవాలని, వారికి కావలసిన సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరిచామని, ఈ దసరా సెలవులు పూర్తయ్యేలోపు హాస్టల్‌కి సంబంధించిన అన్ని సౌకర్యాలు కల్పించి అందుబాటులో తీసుకువస్తామని స్పష్టం చేశారు.

ఆర్‌జియుకెటి ఫైనాన్స్ ఆఫీసర్‌గా దేవి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్‌లో సిఎస్‌సి విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ నాగార్జున దేవి ఆర్‌జియుకెటి ఎపికి ఫైనాన్స్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఈమె గతంలో నూజివీడు క్యాంపస్‌లో ఫైనాన్స్ ఆఫీసర్‌గా, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ అధికారినిగా పనిచేశారు. డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్ర కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ బి.లక్ష్మణ్ రావు, నూజివీడు క్యాంపస్‌లోని అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ఉంగుటూరు : మండలంలోని నారాయణపురం వివేకానంద జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు మంగళవారం సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు షేక్ నాగూర్ మీరా, ఉపాధ్యాయులు గొల్లపల్లి రామారావు, పికెడివి ప్రసాద్‌లు ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన సందర్భంగా నారాయణపురం గ్రామంలోని రిటైర్డ్ ఆర్మీ బృందం వారిని సత్కరించారు. రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు డిడ్ల శ్రీను, కర్రి ప్రసాద్, పొన్నాడ రవి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అభినందన కార్యక్రమానికి పాఠశాల విద్యార్థులు, తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలి

చింతలపూడి: చింతలపూడిలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని, తమ్మిలేరు నుంచి ఇసుక తెచ్చుకోవడానికి పర్మిషన్ ఇవ్వాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (ఎఐటియుసి అనుబంధం) చింతలపూడి ఏరియా కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇసుక సమస్యను పరిష్కరించాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చేపలి శ్రీను, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు జూపూడి వసంత మాట్లాడుతూ చింతలపూడి ఏరియాలో సుమారు 5 వేల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని, ఇసుక లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని, చింతలపూడి కేంద్రంగా ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

కేంద్ర పథకాల అమలు తీరు పరిశీలన

ఉంగుటూరు : కేంద్ర ప్రభుత్వ ప్రయోజిత అభివృద్ధి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అందుతున్న తీరును పరిశీలించేందుకు ఎన్‌ఎల్‌ఎం అధికార బృందం మంగళవారం మండలంలోని కాగుపాడు సచివాలయాన్ని సందర్శించింది. ఐసిడిఎస్, హౌసింగ్, ఉపాధి హామీ తదితర 9 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అభివృద్ధి పథకాలు, వాటి లబ్ధిదారుల వివరాలను, అందుతున్న తీరును వివరించారు. ఎన్‌ఎల్‌ఎం అధికారులు సూర్యకాంత్ ప్రధాన్, అశోక్ కుమార్ సాదు, ఎంపిడిఒ గంజి రాజ్ మనోజ్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచి కడియాల సుదేష్ణ, డ్వాక్రా, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

యంత్ర పరికరం వితరణ

ఉంగుటూరు : కైకరం జడ్‌పి ఉన్నత పాఠశాలలో పచ్చగడ్డి, కలుపు మొక్కలు తొలగించే యంత్ర పరికరాన్ని కోన శ్రీనివాసరావు వితరణ చేశారు. పాఠశాల ఆవరణలో గడ్డి బాగా పెరిగిపోవటంతో పాములు తిరుగుతున్నాయని, విద్యార్థులు ఆటలు ఆడటానికి ఇబ్బందిగా ఉండటంతో గడ్డిని తొలగించేందుకు దాత ముందుకు రావడం అభినందనీయమని ప్రధాన ఉపాధ్యాయులు గుళ్ల ప్రసాదరావు అన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తికొండ రామ ప్రసాద్, సిరిపిరెడ్డి బలరాం, పెనుమాక వేంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల స్థలం ఆక్రమణ

ద్వారకాతిరుమల : మండలంలోని ద్వారకా శ్రీనివాస భవన నిర్మాణ కార్మిక సంఘం సుమారు 200 మంది భవన నిర్మణ కార్మికులతో నడుపుతున్నారు. ప్రతినెలా 1వ తేదీన సంఘం సమస్యలు చర్చించుకోవడానికి వాడుకొనే స్థలంలో ద్వారకాతిరుమలలోని వ్యక్తి ఆక్రమించుకుని, ఆ స్థలంలో ట్రాక్టర్ అడ్డంగా వుంచి సంఘ కార్యకలాపాలకు ఇబ్బంది కలిగిస్తున్నాడని సంఘం అధ్యక్షులు బండారు శివాజీ తెలిపారు. ఈ విషయంపై సుమారు 20 రోజుల నుంచి అడ్డంగా ఉంచిన ట్రాక్టర్ అడ్డు తీయమని సదరు వ్యక్తిని ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోకుండా ఉంటున్నాడని తెలిపారు. ఈ విషయంపై సంఘం సభ్యులు మంగళవారం ఎస్ఐకి తెలపగా మండల సర్వేయర్‌తో మాట్లాడి త్వరలో ఈ సమస్యను పరిష్కరిస్తామని, అంతవరకు సంఘం సమావేశం నిర్వహించుకోవడానికి ఇబ్బంది కలిగించకుండా ట్రాక్టర్ అడ్డు తొలగించుకోవాలని సూచించారు.

విశాఖ ఉక్కు పరిరక్షణపై రేపు నిరసన దీక్ష

ఏలూరు అర్బన్ : విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఈనెల 3న ఏలూరులో జరిగే నిరసన దీక్షను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం) జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం ఏలూరు పవర్ పేటలోని అన్నే భవనంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహనరావు, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.పెంటయ్య మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. మూడవ తేదీన జరిగే నిరసన దీక్షను విజయవంతం చేయాలని కోరారు.

రెండు ట్రాక్టర్లు సీజ్

టి.నరసాపురం మర్రిగూడెం అడవిలో నుంచి పామాయిల్ కలప అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్‌లను గ్రామస్తులు పట్టుకుని ఫారెస్ట్ అధికారులకు అప్పగించిన సంఘటన మండలంలోని గట్టుగూడెం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గట్టుగూడెం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అడవిలో కలపను గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా రవాణా చేస్తున్నారని గుర్తించిన విఎస్‌ఎస్ సభ్యులు తుట్టి రామచంద్రం, పూనెం ప్రకాష్, తుట్టిరాము, పూనెం శ్రీనివాస్, మరికొందరు గత 15 రోజులుగా కాపలా కాస్తున్నారు. దీంతో సోమవారం రాత్రి ఆరుగురు వ్యక్తులు రెండు ట్రాక్టర్‌లపై కలప తరలిస్తుండగా పట్టుకుని ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. ఫారెస్ట్ అధికారులు రెండు ట్రాక్టర్‌లు, కలప స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు.

ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా రాణి

చాట్రాయి : మండల ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా జి.రాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపిడిఒ కె.దుర్గా ప్రసాద్ ఉద్యోగ విరమణ చేయడంతో ముసునూరు మండల ఎంపిడిఒగా పనిచేస్తున్న జి.రాణిని ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా నియమించటంతో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐగా మస్తానయ్య

నూజివీడు టౌన్ : నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐగా ఎ.మస్తానయ్య బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో ఎ.మస్తానయ్య నూజివీడు ప్రొబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ సిఐగా పనిచేసిన వెంకటరమణ గుడివాడ బదిలీ అయినట్లు తెలిపారు.

ఆడపిల్ల బరువు కాదు.. బాధ్యత

కోర్టుకెళ్లి కుమార్తెను అక్కున చేర్చుకున్న డాక్టర్ మనోజ్

వైద్య వృత్తి, సామాజిక సేవలే లక్ష్యంగా ముందుకు..

ప్రజాశక్తి - ముదినేపల్లి

కూతురంటే తండ్రికి చెప్పలేనంత ప్రేమ. కుమార్తెను బాగా చూసుకోవడానికి తండ్రి పాత్ర చాలా ముఖ్యమైంది. ఏ అమ్మాయికైనా మొదటి ప్రేమ తండ్రితోనే. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో కోర్టు ద్వారా విడాకులు తీసుకున్న కుమార్తె వైష్ణవి తనకే కావాలంటూ డాక్టర్ మనోజ్ సుప్రీంకోర్టుకు వెళ్లి, గెలిచి కుమార్తెను తెచ్చుకున్నారు. దీంతో డాక్టర్ మనోజ్ తన కూతురు వైష్ణవి ఆలనా, పాలనా తానే స్వయంగా చూసుకుంటున్నారు.

వివరాల్లోకెళితే.. ముదినేపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ అంబుల మనోజ్ విడాకులు తీసుకున్న తన కుమార్తె పూర్తి బాధ్యత తీసుకున్నారు. ఆడపిల్ల విషయంలో ప్రతీ విషయాన్ని జాగ్రత్తగా చూస్తున్నారు. కూతురి మొత్తం అభివృద్ధిలో ఆయన పాత్ర గణనీయంగా ఉంది.

వైద్య వృత్తి - సామాజిక సేవలు

ఒక వైపు వైద్య వృత్తిని కొనసాగించడం, మరోవైపు సామాజిక సేవలు చేయడమే కాదు, వారు నిర్దేశించిన విలువలు, వ్యక్తిత్వాన్ని కూడా స్ఫూర్తిగా తీసుకొని ఆ దారిలోనే అడుగులు వేస్తున్నారు. డాక్టర్ మనోజ్ ముదినేపల్లిలో ప్రయివేట్ ప్రాక్టీషనర్‌గా పనిచేస్తున్నారు. కుమార్తెకు తల్లిగా, తండ్రిగా ఉంటూ మిగతా సమయాల్లో సామాజిక సేవచేస్తున్నారు. ఇప్పుడు తన కుమార్తె వైష్ణవి బాగుండాలని, పది మందికి సేవలు చేయాలని తండ్రి ఆకాంక్ష.

మాట్లాడే అవకాశం ఇవ్వడం..

ఆయన తన కూతురి భద్రతకు మొదటి స్థానం ఇచ్చాడు. చిన్నతనం నుంచి తన కుమార్తెకు ప్రతిదాని గురించి జ్ఞానం ఇవ్వడంతో పాటుగా ప్రతిదాని గురించి మాట్లాడే అవకాశం ఇచ్చారు. కుమార్తె మాటలు విని, భావాలను అర్థం చేసుకుని సాధ్యమైనంత ఉత్తమంగా సహాయం చేశారు. వైష్ణవి ప్రస్తుతం ఎంబిబిఎస్ రెండో సంవత్సరం చదువుతుంది. డాక్టర్ అయ్యాక నాన్న బాటలోనే పల్లెలోనే ఉండి పేదలకు సేవలందించాలనే లక్ష్యంతో ఉంది.

ధైర్యాన్ని ఇవ్వడం..

తండ్రి, కుమార్తెల మధ్య సానుకూల స్పందన ఉంది. ఆమె ముందుకు సాగడానికి ధైర్యాన్ని ఇచ్చారు. ఆమె ఓటమి లేకుండా ముందుకు సాగేందుకు ఉపయోగపడుతుంది. కుమార్తె చిన్న విజయాలు సాధించినా అభినందించారు. ఆమె అభిరుచులపై ఆసక్తి చూపుతున్నట్లు ఆమెకు అనిపించేలా చేస్తున్నారు. కుమార్తెకు అన్ని విధాలుగా మద్దతునిస్తూ, ముందుకు సాగడానికి ప్రోత్సహిస్తున్నారు. జీవితంలో అన్ని రకాల సమస్యలను ఎదుర్కోవటానికి కుమార్తెను సిద్ధం చేశారు.

తిరుపతి వెంకన్న విగ్రహం ఏర్పాటు..

తన కూతురి కోరిక మేరకు తిరుమల తిరుపతి దేవస్థానంలో ఏడుకొండలు విగ్రహం ఏవిధంగా ఉంటుందో ఆ రీతిలో ముదినేపల్లిలో డాక్టర్ మనోజ్ ఇంటి వద్ద నిర్మించారు. ఆసుపత్రికి వచ్చిన వారు ఈ కొండలను చూసి ఆనందభరితులవుతున్నారు. మండలంలో వెంకటేశ్వరస్వామి ఆలయం ఏ గ్రామంలోనూ లేదు. దీంతో గ్రామస్తులు, ఆసుపత్రికి వచ్చే రోగులు వెంకటేశ్వర స్వామికి నిత్యం పూజలు నిర్వహిస్తారు.

పలు దేవాలయాలకు విరాళాలు..

ఆయనకు ఆధ్యాత్మిక భావన మెండుగా ఉంది. తన స్వగ్రామమైన కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం సుబ్బిచెరువు గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయం నిర్మించారు. ప్రస్తుతం రామాలయం నిర్మాణ పనులు ఆయనతో పాటు ఆయన సోదరి కలిసి నిర్మిస్తున్నారు. ఈ ఆలయ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. గురజ శివాలయంలో టైల్స్ నిర్మాణ పనులను రూ.50 వేలతో చేపట్టారు. చిన్నగొన్నూరు గ్రామంలో రామాలయానికి రాముడు, సీత విగ్రహాల ఏర్పాటుకు ఆర్థిక సహకారం చేశారు. సింగరాయపాలెం, వడాలి, విన్నకోట గ్రామాల్లో శివాలయంలో నవగ్రహాలను ఏర్పాటు చేశారు. ముదినేపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయంలో షెడ్ నిర్మాణం రూ.50 వేలతో చేపట్టారు.

పేదలకు ఆర్థిక సాయం..

ఇల్లు కాలిపోయిన వారికి రూ.5 వేల ఆర్థిక సాయం, రూ.2 వేల విలువైన నిత్యవసర వస్తువులు అందించారు. పేదలు ఎవరైనా చనిపోతే మట్టి ఖర్చు కోసం రూ.5 వేలు నిరుపేదలకు ఆర్థిక సహకారం అందిస్తున్నారు.

పేదలకు సాయం..

డాక్టర్ అంబుల మనోజ్, ముదినేపల్లి

కుమార్తె వైష్ణవి కోరిక మేరకు తిరుమల మాదిరిగా ఇంటి వద్ద ఏడుకొండలు నిర్మించాం. ఆ ఏడుకొండల దగ్గరకు వైష్ణవిని చిన్నప్పుడు తీసుకెళ్లి ఆడించేవాడిని. ఒక వైపు వైద్యం, పేదలకు నా వంతు సాయం చేస్తున్నా. నాలాగా నా కుమార్తె వైద్యురాలిగా ప్రజలకు సేవలు అందించాలి.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

ముసునూరు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఆటలకు రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పివిఎస్.రామకృష్ణ అన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి ఆటలపోటీల సందర్భంగా విజయవాడలో నిర్వహించిన హ్యాండ్ బాల్ కృష్ణాజిల్లా జట్టుకు ఎంపికైన మండలంలోని రమణక్కపేట విద్యార్థులు జె.పవన్ కుమార్, టి.నాగ సుధ, వీరు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. వీరికి తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు వాకా నాగరాజును రమణక్కపేట గ్రామస్తులు అభినందించారు.

సమస్యల పరిష్కారంలో ముందుండాలి

వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి

ఆగిరిపల్లి : అన్ని పోరాటాలకు భూ పోరాటం, కూలీ పోరాటాలు తలమానికాలని, సమస్యల పరిష్కారంలో వ్యవసాయ కార్మికులు ముందంజలో వుండాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి అన్నారు. మంగళవారం ఆగిరిపల్లి సుందరయ్య నిలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి వ్యవసాయ కార్మిక సంఘం రాజకీయ శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజవేతన ప్రకారం పెరిగిన ధరలకు అనుగుణంగా అన్ని రంగాల కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధీ హామీ చట్టాన్ని పాత పద్ధతిలో కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సత్తు కోటేశ్వరరావు అధ్యక్షత వహించగా సిపిఎం మండల కార్యదర్శి చాకిరి శివనాగరాజు, టౌన్ కార్యదర్శి షేక్ జహంగీర్ భాషా, గంటా పాపారావు, పి.సుభాకర్, టి.నాగేశ్వరరావు వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

నేడు మధ్యాహ్న భోజన కార్మికుల సదస్సు

ఆగిరిపల్లి: మధ్యాహ్న భోజన కార్మికులపై వేధింపులు, తొలగింపులు ఆపాలని ఈనెల 2న జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు కోరారు. సోమవారం ఆయన ఆగిరిపల్లిలో మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు, ధరల పెరుగుదలకు అనుగుణంగా పిల్లలకు ఇచ్చే మెనూ చార్జీలు పెంచాలన్నారు. ప్రతినెలా 5వ తేదీ లోపు వేతన బిల్లులు ఇవ్వాలని, రాజకీయ వేధింపులతో వర్కర్ల తొలగింపులు ఆపాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

అంగన్వాడీ కేంద్రానికి స్థలం కేటాయించాలని వినతి

టి.నరసాపురం: మండలంలోని 100 రామన్నపాలెం అంగన్వాడీ కేంద్రానికి సొంత భవనం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరుతూ కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎ.ఫ్రాన్సిస్, జనసేన నాయకులు కొరుకూటి నాగేశ్వరరావు స్థానిక గ్రామపెద్దలతో కలిసి మంగళవారం పోలవరం నియోజకవర్గ ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని తిరుమలపేట గ్రామపంచాయతీ మధ్యాహ్నంవారిగూడెం పరిధిలో ఉన్న 100 రామన్నపాలెం అంగన్వాడీ కేంద్రానికి స్థలం లేక 45 సంవత్సరాల నుంచి అద్దె ఇంట్లోనే నిర్వహిస్తున్నారని తెలిపారు. సమస్యపై స్పందించిన ఎంఎల్‌ఎ బాలరాజు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

ఘనంగా సీనియర్ సిటిజన్స్ డే

లయన్స్ ఆధ్వర్యాన వేడుకల్లో పాల్గొన్న ఎంఎల్‌ఎ బడేటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఆరోగ్య భద్రత ప్రతిఒక్కరీ బాధ్యతని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరులోని సర్ సిఆర్‌ఆర్ కాలేజి గ్రౌండ్స్‌లో లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి ప్రారంభించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎంఎల్‌ఎ చంటిని జ్ఞాపికతో సత్కరించారు. ఈ శిబిరంలో పలువురు వాకర్స్‌కు వైద్యులు డాక్టర్ సుమంత్ గరిమెళ్ల షుగర్, బిపి, గుండె వ్యాధుల నిర్ధారణా పరీక్షలు చేశారు. అలాగే ప్రముఖ వైద్యులు డాక్టర్ డి.సుబ్బారావు, డాక్టర్ ఎంఎల్‌సి ప్రసాద్‌లు పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బడేటి చంటి మాట్లాడుతూ వైద్య శిబిరాలు ప్రజారోగ్య పరిరక్షణకు ఎంతో దోహదమని అభిప్రాయపడ్డారు. లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు, లయన్స్ క్లబ్ సీనియర్ సిటిజన్స్ డే జిల్లా చైర్‌పర్సన్ దాసరి గణేష్ బాబు, లయన్స్ ప్రతినిధులు గట్టిం మణిక్యాలరావు, ఎన్‌విఎస్ పాపారావు నాయుడు, డాక్టర్ వై.జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : వృద్ధుల చట్టాలపై అవగాహన ఉండాలని ఉమ్మడి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక పత్తేబాద్‌లోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో వృద్ధుల దినోత్సవం సందర్భంగా అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ వసతి గృహ పరిసరాల పరిశుభ్రతను ఇంకా మెరుగుపరచాలని, సానిటేషన్ మీద శ్రద్ధ వహించాలని సూచించారు. వసతిగృహం మేనేజర్ రాజు పాల్గొన్నారు.

పలుచోట్ల పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే పెన్షన్ల పెంపు హామీని నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఏలూరు 30, 32 డివిజన్‌లలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంతో పాటూ, ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఎల్‌ఎ బడేటి చంటి పింఛన్‌దారులతో మమేకమై వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పింఛన్ సొమ్ములను అందించారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలందరికీ వివరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. నూతన పెన్షన్ల మంజూరు కార్యక్రమానికి త్వరలో యాప్ కూడా అందుబాటులోకి రానుందన్నారు. ఏలూరు కార్పొరేషన్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, కార్పొరేటర్ పప్పు ఉమామహేశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు.

చింతలపూడి : పేద, అనారోగ్య పీడుతులను ఆదుకునేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున పింఛన్ల మొత్తాన్ని పెంచి అందజేయడం జరుగుతుందని జిల్లా నగర పంచాయతీ కమిషనర్ డి.పావని అన్నారు. మంగళవారం చింతలపూడి నగర పంచాయతీలో తుక్కులూరు, పలు చోట్ల సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. పింఛన్లు పంపిణీ చేస్తూనే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చింతలపూడి ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు సొంగ ఏసు పాదం, బిసి సెల్ అధ్యక్షులు ద్రాక్షవరపు గంగాధర రావు, టిడిపి కార్యకర్త దుక్కుపాటి ప్రకాష్, ఎఎన్‌ఎం వజ్రం పాల్గొన్నారు.

ముసునూరు: పెన్షన్లు ఫస్టు తారీకునే అందరికీ అందజేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని టిడిపి మండల అధ్యక్షులు దేవినేని డలరామ్ అన్నారు. మంగళవారం సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటా పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోండేటి బాబి, టి.రంగరావు, నక్కా యోహాన్, గార్లపాటి నరసింహారావు, పాకనాటి సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : పింఛన్లు సచివాలయం ఉద్యోగులు మంగళవారం నూరు శాతం అందజేశారు. మండలంలోని పలు గ్రామాల్లో కూటమి నాయకులు ఇంటింటా వెళ్లి పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు. నారాయణపురం జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు దండు గోపాలరాజు, ఉపాధ్యక్షులు తమ్మినేని సాయి, నేతింటి నాగరాజు, కార్యదర్శులు బొమ్మిడి అనిల్ కుమార్, బుచ్చిరాజు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పెన్షన్ అందించిన విఆర్ఒ

కైకరానికి చెందిన కొట్టేటి రాఘవమ్మ జారిపడి కాలు విరిగింది. ఈ కారణంగా ఏలూరు ఆశ్రం హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. ఈక్రమంలో విఆర్ఒ నాగేశ్వరావు ఆస్పత్రిలో పింఛన్ డబ్బులు అందజేశారు. మండలంలో దాదాపు నూరు శాతం పింఛన్ల పంపిణీ పూర్తిచేశామని ఎంపిడిఒ రాజ్ మనోజ్ పేర్కొన్నారు. లబ్ధిదారులకు సత్వరం ఆర్థిక సాయం అందేందుకు ఆసుపత్రుల్లో ఉన్నా పెన్షన్ అందజేసేలా చర్యలు చేపట్టారు.

జీలుగుమిల్లి : మండలం వ్యాప్తంగా 4,285 పెన్షన్‌లకు గాను 4,121 ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్‌లను మంగళవారం సచివాలయ సిబ్బందితో కలిసి పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ కెఆర్‌ఎస్ కృష్ణప్రసాద్ తెలిపారు. తాటియాకులగూడెం పంచాయతీ బర్రింకలపాడు గ్రామంలో పోలవరం నియోజకవర్గ ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు చేతులమీదుగా పలువురికి పెన్షన్‌లు పంపిణీ చేశారు. మండలం మొత్తం మీద 96 శాతం వరకూ పెన్షన్లు పూర్తయినట్లు తెలిపారు.

పింఛన్ల పంపిణీలో ఉద్రిక్తత

దెందులూరు: దెందులూరు టిడిపి, జనసేనలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. కొల్లేరు లంక గ్రామం పైడి చింతపాడులో పెన్షన్ పంపిణీలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. జనసేన సర్పంచి ముంగర తిమోతిపై చింతమనేని అనుచరుల దాడి చేసినట్లు సమాచారం. గ్రామ సర్పంచి పెన్షన్లు పంచొద్దంటూ అడ్డగించడంతో వివాదం తలెత్తింది. సచివాలయంలోకి వెళ్లకుండా చింతమనేని అనుచరులు అడ్డుకున్నారు. గ్రామంలో తాము చెప్పిందే జరగాలంటూ టిడిపి నేతల హుకుం జారీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. జనసేన సర్పంచిని తిడుతూ టిడిపి నేతలు పిడిగుద్దులు కురిపించినట్లు సమాచారం. పొత్తులో ఉంటూనే దాడి చేయడంపై జనసేన శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇరు వర్గాలు తీవ్ర ఆరోపణలు చేసుకున్నారు. సవాళ్లు విసురుకున్నారు. తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది.

క్రీడాకారులకు బహుమతులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన మండల, నియోజకవర్గ ఆటల పోటీల సెలక్షన్స్‌లో శ్రీఅన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గొల్లపల్లి విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం పి.రాధికారాణి తెలిపారు. కబడ్డీ, ఖోఖో, యోగా, బ్యాడ్మింటన్, అండర్-14, అండర్-17 విభాగంలో హర్ష, దేవత్రినాధ్, సాయిహర్ష, రుషి, రాజ్ కుమార్, సంతోష్, జగదీష్, కిరణ్, దివ్యరాణి, నందిని, మేఘన ఎంపికయ్యారని తెలిపారు. క్రీడాకారులకు బహుమతులను జీవశాస్త్ర ఉపాధ్యాయులు దోమా విజయలక్ష్మి, శీలం విజయ్, మనోహారం బహుమతులను స్పాన్సర్ చేశారు. ఉపాధ్యాయులు జల్లులక్ష్మి, కృష్ణవేణి, మల్లేశ్వరి సాకారవి పాల్గొన్నారు.

సేవే లక్ష్యంగా యుటిఎఫ్ ముందుకు..

నూజివీడు టౌన్ : సేవే లక్ష్యంగా యుటిఎఫ్ పనిచేస్తుందని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష రవికుమార్ అన్నారు. యుటిఎఫ్ మండల స్వర్ణోత్సవ మహాసభ శ్రీశక్తి భవన్ నూజివీడులో ముక్కు పద్మ కిషోర్ అధ్యక్షతన నిర్వహించారు. నూతన కౌన్సిల్ మెంబర్‌ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పద్మ కిషోర్, ప్రధాన కార్యదర్శిగా గుడిమళ్ల రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. గౌరవాధ్యక్షులుగా జాకబ్రాజు, సహధ్యక్షులుగా పుల్లయ్య, సత్యప్రియ, కోశాధికారిగా నారాయణ, 9 మంది కార్యదర్శులు, ఒక ఆడిటర్, పదిమంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

మొక్కల పంపిణీ

పోలవరం: పోలవరం ప్రాజెక్టు పునరావాస గ్రామాలైన కోండ్రుకోట పంచాయతీ పరిధి పునరావాస గ్రామాల కాలనీలలో ఐటిడిఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గంగు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం మొక్కల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు పునరావాస గ్రామాలలో ప్రజలకు పెరటి వనాల పెంపకంపై ప్రోత్సాహం, పెరటి తోటల పెంపకంతో ఉపాధి కల్పించేందుకు ఒన్‌జిసి ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గిరిజన పునరావాస గ్రామాలలో 414 కాలనీలకు, కొత్త మామిడిగొంది గ్రామాలలో 208 మంది కాలనీలకు మొత్తం మీద 622 కాలనీలకు కొబ్బరి మామిడి, సపోటా మొక్కలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒఎన్‌జిసి రాజమండ్రి కేజీ పిజి బేషన్ మేనేజర్ కె.కరవనన్ పాల్గొన్నారు.

ఆర్‌డిఒ భవాని శంకరికి ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డిఒ వై.భవాని శంకరికి ఆత్మీయ వీడ్కోలు, సన్మాన సభను మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తహశీల్దార్లు మాట్లాడుతూ తక్కువ సమయంలో అందరి ఆత్మీయత పొంది, వరదల సమయంలో ఎంతో శ్రమించి, దాదాపు 80 మందిని సురక్షిత ప్రాంతానికి తరలించారన్నారు. ఎన్నికలను ఎంతో నైపుణ్యంగా, శాంతియుత మార్గంలో నిర్వహించి ఉన్నతాధికారుల ప్రశంసలు పొందిన ఆర్‌డిఒ భవాని శంకరి అందరికీ ఆదర్శనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్‌లు, విఆర్ఒలు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ పడిపోయినది

ఏలూరు జిల్లా, పోలవరం మండలం పాత పట్టిసీమ గ్రామానికి చెందిన శ్రీ వీర భద్ర బోట్స్‌మెన్ అండ్ సాన్డ్ క్వారీ వర్కర్స్ రిజిస్టర్ నెం.534 గల ఒరిజినల్ సర్టిఫికెట్ పట్టిసం నుండి రామయ్యపేట బైక్ మీద వెళ్ళుచుండగా పోయింది. దయచేసి ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది ఫోన్ నెంబర్ కి తెలియజేయగలరు.

ఈ. వెంకట గణేష్
పాత పట్టిసీమ
సెల్: 95056 34845

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుగొండ గ్రామానికి చెందిన శ్రీరాముల లీలా నాగదుర్గా వెంకటేశ్వరరావు, తండ్రి: వెంకటేశ్వరరావు అను నేను నా యొక్క పాస్‌పోర్ట్ పోయింది. ఒక అద్దె ఇల్లు నుండి వేరొక అద్దె ఇల్లుకు మారినప్పుడు నా యొక్క పాస్‌పోర్ట్ పడిపోయింది. నా యొక్క పాస్‌పోర్ట్ నెం.G3619797 గల పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

శ్రీరాముల లీలా నాగదుర్గ వెంకటేశ్వరరావు
తండ్రి: వెంకటేశ్వరరావు
పెనుగొండ మండలం
పెనుగొండ, ప.గో.జిల్లా
సెల్: 81437 32742

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

వ్యవసాయం కూడా ఒక వ్యాపారంలా చేయాలని మండల వ్యవసాయ అధికారి డి.ముత్యాలరావు అన్నారు. మండల పరిధిలో మంగళవారం తెల్లవారిగూడెం, సీతప్పగూడెం గ్రామాలలో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.ముత్యాలరావు పాల్గొని మాట్లాడుతూ ముఖ్యంగా వ్యవసాయంలో ఖర్చు తగ్గించుకోవాలన్నారు. సుస్థిర సేంద్రియ పద్ధతులను అనుసరిస్తూ రసాయన ఎరువులు, పురుగుమందులను తగ్గించుకోవాలని తెలిపారు. దొర మామిడి గ్రామ సర్పంచి తెల్లం రాముడు, గ్రామ వ్యవసాయ సహాయకులు, ప్రకృతి సేద్యం అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ముసునూరు: అధిక దిగుబడులు పొందాలంటే రసాయనిక ఎరువులు వాడకం తగ్గించాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.మధుమోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని గుడిపాడు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయం వద్ద రైతులకు వ్యవసాయ పంటలపై అవగాహన కల్పించారు. రసాయనిక, క్రిమిసంహారక మందులు వాడకం తగ్గించి, కృత్రిమ ఎరువులు వాడకం పెంచి అధిక దిగుబడులు పొందాలని వారికి వివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి గంగారామ్, మండలపు ధర్మరాజు, మండలపు బుజ్జియ్య పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : రైతులు పండించే పంటలలో క్రిమి సంహారక ఎరువుల వాడకం తగ్గించాలని వ్యవసాయ అధికారి కె.గంగాధర్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని పి.అంకంపాలెం, కామయ్యపాలెం రైతు సేవాకేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పంటలను ఉద్యానవన శాఖ అధికారిణి నవీన, పశు వైద్యురాలు లక్ష్మి ప్రసన్నతో కలిసి పరిశీలించారు. పంటలలో క్రిమి సంహారక ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులను వాడాలని రైతులకు సూచించారు.

నూజివీడు టౌన్ : మండలంలోని అన్నవరం హనుమంతుల గూడెంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రైతులతో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఖర్చు తగ్గించుకొని అధిక లాభాన్ని పొందడం, మామిడి సాగులో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి చాముండేశ్వరి, నూజివీడు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు విద్యాసాగర్ పాల్గొన్నారు.

భీమడోలు : వ్యవసాయం, దాని అనుబంధ శాఖల సమన్వయంతో రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పొలం పిలుస్తుంది కార్యక్రమం సేవలను వినియోగించుకోవాలని పొలసానిపల్లి సర్పంచి షేక్ రహీమా బేగం హసేన కోరారు. భీమడోలు వ్యవసాయ అధికారి ఉషారాణి ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని భీమడోలు గ్రామ సచివాలయం మూడు, పొలసానిపల్లి గ్రామ పంచాయతీల పరిధిలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, రైతులు వ్యవసాయ క్షేత్రాల సందర్శన చేశారు. రైతులకు సూచనలు చేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, గ్రామ సచివాలయ, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

'పలుచోట్ల పొలం పిలుస్తోంది'

ముదినేపల్లి : రైతులు భూసార పరీక్షలు చేయించుకొని సిఫార్సులకు అనుగుణంగా ఎరువులను వాడాలని ఎడిఎ జి.వెంకటమణి సూచించారు. మండలంలోని చిగురుకోట, పెదకామనుపూడి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ధాన్యం సేకరణలో ప్రభుత్వం అనుసరిస్తున్న నూతన విధానాలను రైతులకు తెలిపారు. మండల వ్యవసాయ శాఖ అధికారి బి.వేణుమాధవ్, మండల పశు వైద్యాధికారి రామకృష్ణ, టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వి.నరసింహారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
విలేకరులు కావలెను
మీరు జర్నలిస్టు కాదలచుకున్నారా?
మీకు సామాజిక స్పృహ ఉన్నదా?
విన్నది కన్నది పది మందితో పంచుకుందామనుకుంటున్నారా?
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు ఈ క్రింది కేంద్రాల్లో ఆసక్తి గల విలేకరులు కావలెను
అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యలపై అవగాహన
-: విలేకరులు కావాల్సిన ప్రాంతాలు :-
జంగారెడ్డిగూడెం, కైకలూరు, పెదవేగి, నిడమర్రు, లింగపాలెం, అత్తిలి, భీమవరం అర్బన్, ఇరగవరం, పెంటపాడు, పోడూరు, ఏలూరు కల్చరల్
విలేకర్లు కావలసిన రూరల్ కేంద్రాలు
నూజివీడు, విజయరాయి, కైకలూరు, ఏలూరు, జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం, నరసాపురం, భీమవరం
ఇంటర్వ్యూ : తేది: 02-10-2024 బుధవారం ఉదయం 9.30 గంటల నుండి
ఇంటర్వ్యూ జరుగు ప్రదేశం:
ప్రజాశక్తి కార్యాలయం, బలుసువారి వీధి, పవర్‌పేట, ఏలూరు
ఫోన్ నెం: 99493 66196, 89191 70815, 94900 99168, 94900 99190

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2nd Additional సివిల్ జడ్జి (Junior Division) వారి కోర్టులో
E.P. No. 24/2022 in
O.S. No. 312/2021
Decree Holder : Annamreddi Subbarao
Judgment Debtor : Boddu Nethiyya
పై నెంబరు డిక్రీ బాకీ గాను ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని వేలం నిమిత్తం ది. 18-10-2024కి వేసియున్నారు. కావున ది. 18-10-2024 తేదీన ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టుకు వచ్చి పాట పాడుకొనవలసినదిగా తెలుపుకొనడమైనది.
SCHEDULE
West Godavari District, Tadepalligudem Sub Registrar, Tadepalligudem Mandalam, Pullayigudem Grama Panchayati, area, H\o Appraopeta, Pullayigudem village, R.S.No. 511 Near by Door No. 2-63 to an extent of 145 sq. yards of site and RCC roof building therein within the following boundaries.
East : Pedamurthi Venkateswararao building
South : Dirsipo Polayya Building
West : Main road
North : Panchayati cement road
Within the above boundaries an extent of 145 sq. yards of site and RCC roof building with all easement rights.
D.Hr. Value Rs. 4,00,000/-
Amin Value Rs.10,00,000/-
There are no encumbrance on the schedule property as per E.C.
Kusuluri Siva Rama Krishna
Advocate for D.Hr.
Tadepalligudem. Tadepalligudem.
Date: 20-09-2024 Ph: 99490 76266